
# గవళ్ళ అబ్బులుగాడి అల్లుడి చావు

గవళ్ళ అబ్బులుగాడి అల్లుడ్ని ఎవరో చంపేసేరంట. శవం పొలాల మధ్యున్న వెంపర్తమ్మగుడి కవతల బోది కాలవలో పడుందట.

అబ్బులుగాడి పెళ్ళాం అనసూర్య, కూతురు రాణి లబోదిబోమని శోకాణాలు పెడతా వచ్చేరు. రాణి అయితే భర్త శవాన్ని చూడగానే పెద్ద పొలికేకేసి పడిపోయింది. బోరుబోరు మంటా ‘‘నా కూతురి కాపరం మూడ్నాళ్ళ ముచ్చటయిపోయిందా దేవుడా ఓ దేవుడా’’ అంటా అనసూర్య ఏడుస్తుంటే పక్కనోళ్ళకి కూడా ఏడుపొచ్చింది. ఇంతలో సూర్యావతి మొగుడైన అబ్బులుగాడుకూడా వచ్చి శవానికి కొంచెం దూరంలో కూర్చునున్నాడు. వాడు ఏడ్డం లేదు.



చల్దిపొద్దు దాటేటప్పటికి ఊరు ఊరంతా వచ్చేసింది. రామచంద్రపురం నించి వచ్చిన పోలీసు ప్రెసిడెంటు కర్రిమందారెడ్డిగారితో చాలాసేపు మాటాడేక శవాన్ని రాంపురం గవర్నమెంటు హాస్పిటలుకి తీసుకెళ్ళిపోయేరు. ఈలోగా అల్లుడు తాలూకు మనుషులుకూడా వచ్చేరు.

పోస్టుమార్టం జరిగింది. మత్తు ఇచ్చి వృషణాలు గట్టిగా పిసికి చంపేసేరని వచ్చింది రిపోర్టు.

ఆ కుర్రోడికి వూళ్ళో శత్రువులెవరూ లేరు, చెడుస్నేహాలు చెయ్యడు. ఆడోళ్ళ జోలికెళ్ళడు. తాగుడు, పేకాడ్డం లాంటివి లేవు. అయితే ఆడ్ని ఎవరు చంపినట్టు? అసలు ఎందుకు చంపినట్టు? రాజుగారి హాల్లో సస్పెన్సు బొమ్మ చూస్తున్నట్టుంది మాకు.

* * *


వారం అయ్యింది.  ఈకేసు విషయంలో పోలీసులు ఒక్క అడుగుకూడా ముందుకి వెయ్యలేకపోతున్నారు.

అబ్బులి అల్లుడిచావు గురించి ఊళ్ళో ఎవరికి తోచిన కథలు ఆళ్ళు అల్లేసుకుంటున్నారు.

రోజూలాగే ఆ సాయంత్రం పూట చింతాబ్రాహ్మణరెడ్డిగారి అరుగుమీద జనం పోగవుతున్నారు. నాటకం రిహార్సలు చేయిద్దామనుకున్న బ్రాహ్మణరెడ్డిగారు పిఠాపురంనించి హీరోయిను రాకపోడంతో ఆవేళ రిహార్సల్సు వద్దనేసేరు. చెల్లూరునించి వచ్చిన నాటకాల డైరెక్టర్లు వల్లూరి ఆదినారాయణగారు అరుగుమీద కూర్చున్న స్వరాజ్యరెడ్డిగారికీ మల్లిడి గంగిరెడ్డికీ మధ్యలోకి జేరి ''అయితే ఎవరు చంపేరంటారు ఆ అబ్బులుగాడి అల్లుడ్ని?'' అన్నారు.

''నేను చెపుతాను'' అన్నాడు స్వరాజ్యరెడ్డిగారు.

''లేదు నే చెపుతాను'' అన్నాడు మల్లిడిగంగిరెడ్డి.



''ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు చెప్పండి'' అనేసరికి మల్లిడిగంగిరెడ్డి మొదలెట్టేడు.

అబ్బులుగాడి కూతురు రాణి పెద్దమనిషయ్యి రెండేళ్ళయినా ఇంకా పెళ్లవ్వలేదు. వూళ్ళో ఆ పిల్లమీద కతలున్నాయి. ''పిల్లకి పెళ్ళి చెయ్యొచ్చుగదా'' అని అబ్బులు పెళ్ళాం అనసూర్యని ఎవరన్నా అడిగితే ''దానికయ్యే రోజొచ్చినప్పుడు అదే అవ్వుద్ది. మధ్యలో మనం కలగ జేసుకున్నంతలో ఏదీ కదల్దండి'' అనేదామనిషి.

అయిదెకరాల మూడు మానికల పొలం వున్న చాకలి సత్తిగాడు రాణీని ఇష్టపడ్డాడు. ఇద్దరూ పుంతరేవు దగ్గర కర్రిసత్తిరాజుగారి దూళ్ళపాకలో కల్సుకుంటుంటే బ్రేమ్మలు సుబ్బారావుగారు చూసేసేడు.

పంచాయితీ పెట్టిన పెద్దలు ఇద్దరికీ తప్పు వేసేరు. రాణి రెండువేల అయిదొందలూ, సత్తిగాడు అయిదువేలూ తప్పు కట్టాల్సివచ్చింది.

''ఇదంతా మీకూ తెల్సుగదా?'' అన్నాడు మల్లిడి గంగిరెడ్డి.

తెలుసన్నారంతా. అయితే కొంతకాలానికి సత్తిగాడికి పిఠాపురానికి ముందున్న చిత్రాడ సంబంధం వస్తే పెళ్ళి చేసేసుకున్నాడు. రాంపురం కిశోర్ టాకీస్‌లో పనికి కుదిరి కేబిన్ రూమ్‌లో సినేమారీళ్ళు చుట్టేవాడు. మెల్లమెల్లగా మేనేజరు రామదాసుగార్నీ, ఆపరేటరు శంకర్రావునీ మంచి చేసుకుని ప్రొజెక్టర్ తిప్పడం నేర్చుకున్నాడు సత్తిగాడు.

ఇటు పక్క రాణీకి అనకాపిల్లి అవతల మాడుగుల సంబంధం వస్తే పెళ్ళి చేసేరు. అల్లుడు మనుగుడుపుకికూడా వచ్చేడు.

కిషోర్ టాకీసులోకి ఎన్టీవోడి కొత్తబొమ్మ ఆలీబాబా 40దొంగలు వస్తే రెండోఆటకి అనసూర్య, అల్లుడు, కూతురు పెద్దబ్బులు రిక్షాలో వెళ్ళేరు. ఇంట్రొవెల్లప్పుడు సత్తిగాడు రాణీని చూసేడు.

రాణీ సత్తిగాడ్ని చూసింది.

టిక్కెట్లు చింపే సాయిబులకుర్రోడితో రాణీని మరుగుదొడ్లోకి రమ్మని కబురంపేడు సత్తిగాడు.

కబురొచ్చిన వెంటనే కాళ్ళు ముడుచుకొస్తానని బయటికొచ్చింది రాణీ. లోపల రాణీకోసం చూస్తున్న సత్తిగాడు, ఆ పిల్ల వచ్చిన వెంటనే అమాంతంగా కౌగిలించేసుకున్నాడు.

చాలా రోజుల తర్వాత కల్సుకున్న ఆళ్ళిద్దరూ ఒకళ్ళనొకళ్ళు కరిచిపెట్టేసుకున్నారు. అలాగ ఎంతసేపుండి పోయేరో వాళ్ళకే తెల్దు. నిలబడే అంతాను.

కడుపు ఉబ్బరంగా ఉందని లేచేడు అల్లుడు.

లోపల మరుగుదొడ్లోకెళ్ళేసరికి ఒంటిమీద చిన్న గుడ్డముక్క కూడా లేకుండా కనిపించేరు రాణీ, సత్తిగాడూ.

ఇంకోడయితే తట్టుకోలేడు. ఎలాగో తమాయించుకున్నాడా అల్లుడు. ఏదీ తెలీనోళ్ళా తిరిగొచ్చి కుర్చీలో కూర్చుని చివర్లో వచ్చే జనగణమన దాకా చూసేడు సినేమా. ఇంటికొచ్చేకా నవ్వుతా రాణీ దగ్గరకొచ్చిన అల్లుడు ''ఎవడాడు ఆడితో ఎంతకాలంనించి జరుగుతుంది నీ ఆట?'' అన్నాడు. భయపడిపోయింది రాణి. ''చెపుతావా కౌజారుతో పొడిచెయ్యనా?'' కరుగ్గా ఉందాడిస్తోను.

వాళ్ళ మధ్యలో కొచ్చిన అనసూర్య ''తప్పు జరిగిపోయింది బాబూ! ..నా బిడ్డ చేసిన తప్పుకి మన్నించు అల్లుడా'' అని కాళ్ళట్టుకుని ఏడ్చింది. ఏమాత్రం వినిపించుకోని ఆ అల్లుడు ''ఈ వూళ్ళో అందరి ముందరా మీతంతు బయటపెడతాను. ఇక్కడగానీ కుదరకపోతే మాచోడవరంలో చూపిస్తాను నేనేంటో'' అన్నాడు. తన కూతురు కొంప కొల్లేరయినందుకు తెగ ఏడ్చింది అనసూర్య... పదిమందికి తెలిస్తే పరువుపోతుంది. మరెలాగా అల్లుడుపోయినా పర్లేదుగానీ పరువుపోకూడదు అని ఆలోచించిన అనసూర్యకి సత్తిగాడు గుర్తుకొచ్చేడు.

కబురంపితే వచ్చిన సత్తిగాడితో ఈ పని, గుట్టు చప్పుడు గాకండా జరిగిపోవాలంది.

అప్పటికి అర్ధరాత్రయ్యింది. ఆకాశంలో గొల్లకావిడి అటుపక్కకి జరిగింది.

గాలి చల్లగా వీస్తుంది. తొలికోడి కుయ్యడానికింకా చాలా టైముంది.

సిగరెట్టు కాలుస్తా సగం పడిపోయిఉన్న దొడ్డిగోడ దగ్గర నిలబడి ఉన్నాడు మాడుగుల అల్లుడు. వెనకనించి నడుచుకుంటా వచ్చిన సత్తిగాడు చేతిలో ఉన్న సర్వీపేడుతో అల్లుడు మెడకాయమీద బలంగా ఏసేడు దెబ్బ. స్పృహ తప్పిన అల్లుడికి అనసూర్య, సత్తిగాడూ కల్సి మత్తు ఇంజక్షను ఇచ్చేసి కాస్సేపయ్యేక ఆ అల్లుడి వృషణాలు పిసికేసింది అనసూర్య.

గిలగిలా కొట్టుకుని ప్రాణాలు పోగొట్టుకున్న ఆ అల్లుడి శరీరాన్ని బరకం గుడ్డలో మూట గట్టి వెంపర్తమ్మ గుడి అవతల పొలాలమధ్యలో బోదికాలవలో పడేసేడు సత్తిగాడు. పొద్దుటే పొలంలో నీరు కట్టడానికొచ్చిన కర్రోరబ్బాయి కొన ఊపిరితో ఉన్న అల్లుడ్ని మూటవిప్పి రోడ్డు సైడుకి తీసుకురాబోతుంటే ''ప్రేణాలు పోయినియ్యి'' అని పూర్తి చేసేడు మల్లిడి గంగిరెడ్డి.

ఇది ఆయన కల్పించి చెప్పినా నిజవే అవ్వొచ్చు అనుకున్నారంతా.

* * *

మానాన్న పెద్దమ్మకూతురయిన చెల్లాయమ్మని మా చెల్లాయత్త అని పిలుస్తాం మేం. ఊళ్ళో అంతా మేడ చెల్లాయమ్మగారంటారు. ఊళ్ళో చాలా మందికి మేడలున్నాయి మరి ఆవిడ్ని మట్టుకి ఎందుకలా పిలుస్తారో అర్థంగాదు నాకు.

పొద్దోతే ఆవిడ దగ్గరికి చాలామంది ఆడోళ్ళు జేరతారు. వాళ్ళలో కుంటిసూరమ్మ, వాళ్ళ చెల్లిభానూ, మాసరమ్మ, మారెడ్డిగారి బుల్లెమ్మాయి, గున్నయ్యగారి విధవకోడలూ ఇలా చాలా మంది. నున్నటిగచ్చు మీద దేక్కుంటా మా చెల్లాయత్త దగ్గరకొచ్చిన కుంటిసూరమ్మ ''చెల్లాయి పిన్నీ! అబ్బులుగాడి అల్లుడిచావెలా జరిగిందంటావ్?'' అంది.

మా చెల్లాయత్తకి కారాకిళ్ళీ అలవాటుంది. ఎండిపోయిన తమలపాకుల్లో, సున్నం, చెక్కపొడుం, చిన్న పొగాకుకాడ వేసుకుని చుట్టి చుట్టి దగ్గొస్తున్నప్పుడు కరక్కాయ బుగ్గ నెట్టుకున్నట్టు ఆ కిళ్ళీ చుట్టని బుగ్గన బిగించిన మా చెల్లాయత్త మరి చెప్పడం మొదలెట్టింది.

రాంపురం కిషోర్ టాకీసులో రాణీ ఆ సత్తిగాడూ ఒళ్ళో పాయా తెలీకండా తొంగుని ఉండగా చూసేసేడు దాని మొగుడు.

నా మొగుడంటే నాకు ఇష్టం లేదనీ నిన్ను ఈ జన్మకి మరిచిపోలేననీ ''ఆడ్ని ఒదిలించుకునే దారి చెప్పు''మని అడిగింది సత్తిగాడ్ని.

ఆలోచించిన సత్తిగాడు ''నీ మొగుడి అడ్డు తొలగించుకునే ఉపాయం చెప్పమంటావ్?'' అన్నాడు.

''అవును'' అంది రాణీ. ''సరే విను మరి... పులసల సీజనగదా ఇప్పుడు... చేపల పులుసులో ఒక పాతిక మత్తుబిళ్ళలు కలిపెయ్... తిన్న ఆడికి మత్తెక్కి పడిపోతాడు..అప్పుడాడ్ని గోనెసంచిలో మూటగట్టి ఉంచితే రాత్రికి నేనొచ్చి గోదాట్లో పడేస్తానామూటని'' అన్నాడు సత్తిగాడు. ఆడు చెప్పిందాంట్లో అక్షరం పొల్లుపోకండా చేసింది రాణీ.

అర్థరాత్రి దాటేకా సత్తిగాడొచ్చి మూటని భుజానేసి తీసుకెళ్తుంటే లోపలున్న రాణీమొగుడికి మత్తు దిగింది. ఆడికి తెలివొచ్చింది. గిలగిలా కొట్టుకుంటున్నాడు అరుస్తున్నాడు. కరుస్తున్నాడు.

దాంతో, ''మూట విప్పిన సత్తిగాడు కొడవలితో ఆడి బోర కోసేద్దావనుకున్నాడుగానీ దానికంటే సులువైన పని వృషణాలు పిసికేసి చంపేసి తిరిగి గోనెసంచిలో కుక్కేసి బోదికాలవలో పారేసేడు అని ఆగింది'' మా చెల్లాయత్త.

రాణీ సత్తిగాడి కథలు ఇంతకు ముందే తెల్సుగాబట్టి మా చెల్లాయత్త చుట్టూ మూగిన ఆడోళ్ళంతా ''నిజంగా ఇలాగే జరిగుంటది'' అనుకున్నారు.

* * *

వేసవికాలం రాత్రి.

పక్కనే వెడల్పాటి గోదావరి కాలవ ఉన్నా అస్సలు ఆడ్డం లేదుగాలి.

వంతెన కింద సత్రంలో ఎన్నో ఏళ్ళనించి ఉంటున్న సాధువు దగ్గరకి సెలపర్తిపాడు నించీ, అనావతరం నించీ వచ్చిన సాధువులు దిగేరావేళ. ఆ రాత్రి గంజాయి దమ్ము దట్టిస్తున్నప్పుడు ఏంటి మీ ఊరి విశేషాలని మాఊరి సాధువుని అడిగేరా పొరుగూరి సాధువులు.

చెప్పడం మొదలెట్టాడు మా వూరి సాధువు. ''పదిరోజుల క్రితం గవళ్ళ అబ్బులుగాడి అల్లుడు చచ్చిపోయేడు. ఎవరో మత్తు మందిచ్చి, పిచ్చులు పిసికేసి చంపేసేరు. ఎవరు చంపేరో ఎందుకు చంపేరో ఎవరూ తేల్చలేక పోతున్నారు. అంతా చూస్తున్న నా మట్టుకైతే అది హత్యాగాదు ఆత్మహత్య అనిపిస్తుంది'' అన్నాడు.

వింటున్న బయటూరి సాధువులకి చాలా బాగుంది వినడానికి ''చెప్పు'' అన్నారు.

జరిగిందంతా చెప్పేడు మా ఊరి సాధువు.

అంతా విన్న సెలపర్తిపాడు సాధువు ''ఇది హత్యకాదు ఆత్మహత్య'' అన్నాడు.

''ఎలాగ?'' అడిగేడు మా ఊరి సాధువు.

''ఎలాగంటే... సినేమా హాలు మరుగుదొడ్లో ఆళ్ళిద్దర్నీ ఆ దశలో చూసిన రాణీ మొగుడు అక్కడే అల్లరి చెయ్యాలి. కానీ, ఆడు చెయ్యలేకపోయేడు. అంటే ఆ కుర్రోడికి బయటికి అరిచే ధైర్యం లేదు. తనలో తనే కుమిలిపోయిన నిజాయితే పరుడైన ఆ కుర్రోడు పెళ్ళాన్నేం అన్లేక సత్తిగాడ్నేం చెయ్యలేక తనలో తనే కుమిలిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని నేననుకుంటున్నాను'' అన్నాడు సెలపర్తిపాడు సాధువు. ''అవును...అలా బయట పడలేనోళ్ళు అలాగే చేస్తా''రన్నాడు అప్పుడే వాళ్ళ మధ్యలో కొచ్చిన రాజానగరం సాధువు.

''నేనుకూడా ఈళ్ళ తరుపునే వాదిస్తాను'' అన్నాడు అనావతరం సాధువు.

వాళ్ళ వాదులాట వింటున్న మావూరి సాధువుకి ఆత్మహత్య అన్న ముక్క మట్టుకి చాలా సబబుగా తోచింది.

సరాలపాలెంలో వాళ్ళంతా అది హత్య అనీ, సర్పాయతోటలో జనం మామూలుగా వచ్చిన చావు అనీ, సూరాయమ్మపేటలో మనుషులు మాకూ అర్థం గావటం లేదనీ అనుకుంటున్నారు.

* * *

చాన్నాళ్ళు గడిచిపోయినియ్యి. పోలీసులకి అది హత్యో, ఆత్మహత్యో ఇప్పటికీ అర్థంగాకుండా పోయింది.

మొత్తానికి గవళ్ళ అబ్బులుగాడి అల్లుడిచావు ఎవరికీ అంతుబట్టకుండా ఒక మిస్టరీగా మిగిలిపోయింది పసలపూడిలో.

* * *